ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 26-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

ముఖ్యాంశాలు

- ప్రతికూల పరిస్థితులను తట్టుకుని సైనికులు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు.
- ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దేశ ప్రగతికి బాటలు వేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- వ్యర్థాలతో సంపద సృష్టించ వచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు.
- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ కి శాశ్వత సభ్యత్వం ఉండాలని ఫ్రాన్స్ కోరింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని దేశాన్ని రక్షిస్తున్న సైనికుల సేవలు ఎనలేనివని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. లడఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాంప్‌ను ఈ రోజు ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సియాచిన్ గ్లేసియర్‌లో సైనికులు అధికారులతో సంభాషించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సైనికుల కుటుంబసభ్యులు, బంధువులకు దేశం తరఫున ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సియాచిన్ బేస్ వార్ మెమోరియల్ వద్ద అమరవీరులకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వాయిస్ బైట్ .. ద్రౌపతి ముర్ము

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వర్తమాన కాలంలో శాస్త్రీయ పరిశోధనలకు గుర్తింపు గణనీయంగా పెరిగిందని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన 83వ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏ దేశానికైనా అభివృద్ధి చోదక శక్తిగా శాస్త్ర సాంకేతిక రంగాలే కీలక పాత్రను పోషిస్తాయని అన్నారు. పరిశోధన, అభివృద్ధి విషయంలో పెట్టుబడులు పెట్టాలని కార్పొరేట్ రంగానికి ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా దేశంలోని శాస్త్రవేత్తలు తమ ప్రతిభను పూర్తిగా ఉపయోగించుకునే వాతావరణం ఈ రోజు ఉందని ఆయన గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునిక సాంకేతిక సంపత్తితో భారతదేశం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్‌లో భాగంగా దేశీయంగా అభివృద్ధి చేసిన 130 కోట్ల రూపాయల విలువైన మూడు PARAM రుద్ర సూపర్ కంప్యూటర్‌లను న్యూఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ఈరోజు ప్రారంభించారు. అత్యాధునిక శాస్త్రీయ పరిశోధనల కోసం పూణె, ఢిల్లీ, కోల్‌కతాలో ఈ అధునాతన వ్యవస్థలు ఏర్పాటవుతున్నాయి. వివిధ శాస్త్రీయ పరిశోధనల కోసం వీటిని రూపొందించారని ఈ సందర్భంగా ప్రధానమంత్రి పేర్కొంటూ...

వాయిస్ బైట్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రహదారుల నిర్మాణంలో వ్యర్థాలను ఉపయోగించడం ద్వారా నిర్మాణ ఖర్చులను తగ్గించవచ్చునని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బూడిద, ప్లాస్టిక్, రబ్బరు వంటి వ్యర్థాలను రహదారుల నిర్మాణానికి ఉపయోగించాలని సూచించారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ అధునాతన సాంకేతికతతో వ్యర్థాల నుండి సంపదను సృష్టించవచ్చని అన్నారు. వినూత్నమైన విధానాలు అనుసరించడం ద్వారా వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఖర్చుని కూడా తగ్గించగలమని తెలిపారు. దేశంలో కొత్త తరహా విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రానున్న రోజులలో ప్రతీ రంగంలోనూ వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకునే వ్యవస్థ రావాలని కేంద్ర మంత్రి ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా భారత్ ఉండాలని కోరుతూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పూర్తి మద్దతు తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సమావేశంలో సాధారణ చర్చలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయం ప్రస్తావించారు. భారతదేశం, జర్మనీ, జపాన్ బ్రెజిల్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యులుగా ఉండాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. ముఖ్యంగా భద్రతా మండలి ప్రస్తుత నిర్మాణాన్ని మరింత ప్రభావితం చేయడానికి పలు సంస్కరణల అవసరాన్ని కూడా ఫ్రెంచ్ అధ్యక్షుడు తెలియజేసారు. కాగా, అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చిలీ, అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ ఫాంట్ సహా ఇతర ప్రపంచ నాయకులు కూడా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారతదేశం యొక్క శాశ్వత సభ్యత్వాన్ని సమర్థించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రంలో మూడవసారి అధికారం చేపట్టిన ఎన్ డి ఏ ప్రభుత్వం వికసిత భారత్ దిశగా పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. సామాజిక సంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రారంభించింది. పేదలు, అట్టడుగు వర్గాలు, వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో ప్రభుత్వం కృషి చేస్తోంది. వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సంపూర్ణత అభియాన్ పేరుతో దేశంలో 112 జిల్లాల్లో పేదవర్గాలకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే మత్తు పదార్థాల రహిత దేశం కోసం మానస్ హెల్ప్ లైన్ ని ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల మధ్య ఈరోజు ఉదయం సాధారణంగా ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత సానుకూలంగా రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 85,167.56 పాయింట్ల వద్ద ప్రారంభమై 85,836.12 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 26,250.90 పాయింట్లతో సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. 211.90 పాయింట్ల లాభంతో 26,216.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.65 గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-ఇండోనేషియా 8వ విదేశాంగ కార్యాలయ సంప్రదింపుల సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. రక్షణ భద్రత, వాణిజ్యం పెట్టుబడులు, ఆరోగ్య సంరక్షణ వంటి ద్వైపాక్షిక సంబంధాలపై ఇరుపక్షాలు సమగ్ర సమీక్షను చేపట్టాయి. అదే విధంగా పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ ప్రపంచ సమస్యలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. భారతదేశం-ఇండోనేషియా దౌత్య సంబంధాలు మొదలై 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. దానికి గుర్తుగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి ఇరుపక్షాలు చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లెబనాన్ ను విడిచి వెళ్లాలని బేరూట్‌లోని భారత రాయబార కార్యాలయం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. గత మూడు రోజులుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులు చేస్తున్న నేపథ్యంలో ఈ మేరకు భారత విదేశాంగ శాఖ స్పందించింది. లెబనాన్ లోని బేరూట్‌లోని భారత రాయబార కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి

చేసింది. కాగా, లెబనాన్‌లో మూడు వేల మంది భారతీయులు ఉన్నారని అధికార వర్గాలు తెలిపాయి. మరో వైపు భారత్‌లో ఉంటున్న ప్రజలు లెబనాన్‌కు వెళ్లవద్దని కూడా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉక్కు పరిశ్రమలలో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రోత్సహిస్తున్నామని ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి తెలిపారు. ఈరోజు ఢిల్లీలో 'ఏక్ పెద్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, పారిస్ ఒప్పందంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి, అదే విధంగా 2030 నాటికి సున్నా ఉద్గారాలను సాధించడానికి భారతదేశం కృషి చేస్తోందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చైనాలో జరుగుతున్న మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్ 21-13, 21-18 తేడాతో ఆయుష్ శెట్టిపై విజయం సాధించారు. మరోవైపు మహిళల డబుల్స్ లో భారత మూడో సీడ్ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ 22-20, 21-11తో తైవాన్ కు చెందిన లిన్ చిహ్-చున్, టెంగ్ చున్ జోడీని ఓడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 7వ రాష్ట్రీయ పోషణ మహోత్సవంలో భాగంగా ఇప్పటివరకు 9 కోట్ల 20 లక్షల కార్యక్రమాలను నిర్వహించినట్లుగా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రతీ ఏటా పోషకాహారం ఆవశ్యకత పైన కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలలో నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం పోషణ మహోత్సవ కార్యక్రమాల్లో ఇప్పటివరకు మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అగ్రగామిగా ఉన్నాయని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు ఉదయం 155 గంటల నిరంతరమైన అతి పెద్ద పరిశుభ్రతా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ 155వ జయంతి రోజున ఈ కార్యక్రమం ముగుస్తుంది. స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత" అనే అంశంతో పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత పర్యావరణం పట్ల అవగాహనను కలుగచేయడమే ఈ ప్రచారం లక్ష్యంగా ఉంది. స్వచ్ఛతా హి సేవా పఖ్వాడా"లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పట్టణాభివృద్ధి శాఖను ఆదేశించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వాలంటీర్లు విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం సాగనుందని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =